# కాంగ్రెస్ కోట్ల కుతంత్రాలు

- ధన రాజకీయాలకు కేరాఫ్‌గా హస్తం పార్టీ
- విశాఖ ఇండస్ట్రీస్ నుంచి 8 కోట్లు తరలించిన అన్నదమ్ములు
- చెన్నూరు, బెల్లంపల్లికి 4 కోట్ల చొప్పున
- భారీగా డబ్బు పంపకానికి వివేక్, వినోద్ సిద్ధం
- పొంగులేటి ఏడున్నర కోట్లపై తుది దశకు విచారణ

హైదరాబాద్, నవంబర్ 23 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో ఎక్కడ చూసినా కాంగ్రెస్ 'నోట్ల కట్టల పాములు' బుసలు కొడుతూనే ఉన్నాయి. అసెంబ్లీ ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలన్న దురాలోచనతో ఎంతకైనా తెగబడుతున్న ఆ పార్టీ ధన రాజకీయాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారింది. ఖమ్మం జిల్లాలో పోటీచేస్తున్న బీఆర్ఎస్ అభ్యర్థుల్లో ఒక్కరిని కూడా అసెంబ్లీ గేటు తాకనివ్వబోనని శపథాలు చేసిన నాయకుడే గెలిచే పరిస్థితి లేకపోవడంతో ఆయన తన అనుచరగణంతో హైదరాబాద్ నుంచి 'క్యాష్ కాన్వాయ్'ను రప్పిస్తూ అడ్డంగా పట్టుబడ్డాడు. మరోవైపు అక్రమంగా సంపాదించిన సొమ్ము నుంచి తొలుత చెరొక రూ.4 కోట్లను తమ నియోజకవర్గాల్లో పంచి గెలువాలనుకుంటున్న అన్నదమ్ములు సైతం దొరికిపోయారు. ఇంకో వైపు తన కొడుకును ఎమ్మెల్యేగా చేయాలని భావించిన ఓ కాంగ్రెస్ కురువృద్ధుడు తనకు తానే డమ్మీ నామినేషన్ వేసుకొని.. కొడుకు కోసం రూ.కోట్లు పంచేందుకు సిద్ధయ్యాడు. ఇలా ఎంతోమంది కాంగ్రెస్ నేతలు తమ రాజకీయ భవితవ్యం కోసం భారీగా డబ్బు వెదజల్లేందుకు 'కోట్ల కుతంత్రాలు' పన్నుతున్నారు.

### చెన్నూరుకు, బెల్లంపల్లికి చెరిసగం..

చెన్నూరు, బెల్లంపల్లి నియోజకవర్గాల్లో కాంగ్రెస్ తరపున పోటీ చేస్తున్న అన్నదమ్ములు గడ్డం వివేక్, వినోద్ మధ్యన రూ.8 కోట్లు కలకలం సృష్టించాయి. అన్న డబ్బులో తమ్ముడికి, తమ్ముడి డబ్బులో అన్నకు ఉన్న లింకులను సాక్షాత్తూ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులే బుధవారం బయటపెట్టారు. వివేక్ తన విశాఖ ఇండస్ట్రీస్ కంపెనీ అకౌంట్ నుంచి విజిలెన్స్ సెక్యూరిటీ అనే బోగస్ సంస్థకు బదిలీ అయిన ఈ రూ.8 కోట్లను అన్నదమ్ములిద్దరూ చెరిసగం తమ నియోజవర్గాలకు తరలించేందుకు కుట్ర పన్నినట్టు తేలడంతో వివేక్ ఇండ్లు, ఆఫీసులు, ఇతర కార్యాలయాల్లో ఐటీ, ఈడీ అధికారులు ఏకకాలంలో సోదాలు చేపట్టారు. అక్కడ పలు డాక్యుమెంట్లు, వస్తుసామగ్రి స్వాధీనం చేసుకున్నారు. వాటి ఆధారంగా ఆ రూ.8 కోట్లలో వినోద్ పాత్ర కూడా ఉన్నట్టు గుర్తించిన అధికారులు.. ఆయన ఇండ్లతోపాటు హెచ్‌సీఏలోనూ సోదాలు జరిపారు. దీంతో ఆ అన్నదమ్ముల అసలు రంగు బయటపడింది. వివేక్ ఖాతా నుంచి బదిలీ అయిన రూ.8 కోట్లలో చెన్నూరుకు సగం, బెల్లంపల్లికి సగం తరలించాలని వారు ప్రయత్నించినట్టు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

### పొంగులేటికి స్థానిక ఫైనాన్సర్ల సాయం

హైదరాబాద్ నుంచి రావాల్సిన 'క్యాష్ కాన్వాయ్'ని మధ్యలోనే పోలీసులు అడ్డుకోవడంతో ఖమ్మానికి చెందిన కాంగ్రెస్ నేత పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఇరకాటంలో పడినట్టు ఆయన సన్నిహిత వర్గాలే చెబుతున్నాయి. గతంలో ఖమ్మం నుంచి ఎంపీగా గెలిచిన ఆయన ఇప్పుడు తొలిసారిగా పాలేరు నుంచి అసెంబ్లీకి పోటీ చేస్తున్నాడు. బీఆర్ఎస్‌ను వీడిన వెంటనే స్థానిక పార్టీ నేతలపై కక్షగట్టిన పొంగులేటి.. ఖమ్మం జిల్లా నుంచి ఏ బీఆర్ఎస్ అభ్యర్థినీ అసెంబ్లీ గేటు తాకనివ్వబోనని ధనమదంతో శపథం చేశాడు. కానీ, పొంగులేటి 'క్యాష్ కాన్వాయ్' మధ్యలోనే అడ్డంగా దొరికిపోవడంతో ఆయన దిక్కుతోచని స్థితిలో పడ్డాడు. ఈసారి ఎలాగైనా గెలవాలన్న దురుద్దేశంతో ఖమ్మంలోని తనకు తెలిసిన ఫైనాన్సర్ల సహాయం తీసుకుని, వారి ద్వారానే ఓటర్లకు డబ్బు పంచేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నాడు. 'క్యాష్ కాన్వాయ్'పై విచారణ తుదిదశకు చేరుకోవడంతో ఈ వ్యవహారంలో తన పేరు బయటికి రాకుండా చూసుకునేందుకు విశ్వప్రయత్నాలు చేస్తున్నాడు.

### కొడుకును ఎమ్మెల్యే చేయాలని..

నాగార్జునాసాగర్ అసెంబ్లీ సెగ్మెంట్‌లో ఇప్పటికే రెండుసార్లు ఓటమిపాలైన కాంగ్రెస్ రాజకీయ కురువృద్ధుడు కే జానారెడ్డి ఈసారి ఎలాగైనా తన కొడుకును ఎమ్మెల్యే చేయాలని తహతహలాడుతున్నాడు. అందుకోసం తనకు తానుగా డమ్మీ నామినేషన్ వేసి, తిరస్కరణకు గురయ్యాడు. తన చరిష్మా తగ్గిపోవడంతో కొడుకు రంగంలోకి దించిన ఆయన.. తెరవెనుక డబ్బు పంపకాలను చేపట్టినట్టు ఎన్నికల అధికారులే గుర్తించారు. ఈ క్రమంలో ఐటీ సోదాలు జరిపి, భారీగా నగదును పట్టుకెళ్లారు. మరోవైపు మహేశ్వరం టికెట్ ఆశించి భంగపడిన ఓ కాంగ్రెస్ నాయకురాలి ఇంట్లో జరిపిన ఐటీ సోదాల్లోనూ భారీగా డబ్బు దొరికింది. అప్పటికే ఆమె తన టికెట్ కోసం డబ్బులు చెల్లించింది. కానీ, ఆమెకు కాంగ్రెస్ టికెట్ రాకపోవడంతో భర్తను ఢిల్లీ కాంగ్రెస్ పెద్దల వద్దకు పంపి ఆ డబ్బును తిరిగి తీసుకున్నట్టు తెలిసింది.

# ఓటేయకపోతే వ్యవస్థలు నిర్వీర్యం

- ప్రజాస్వామ్య ప్రక్రియలో యువత క్రియాశీలకం కావాలి
- సీఎం కేసీఆర్ ప్రభుత్వం సమర్థంగా పనిచేస్తున్నది
- నూతన ఓటు హక్కు పొందిన విద్యార్థినులతో ఎమ్మెల్సీ కవిత

కొత్తగా ఓటు హక్కు పొందిన విద్యార్థినులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

ఖలీల్‌వాడి, నవంబర్ 23: ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్కరూ ఓటేయాలని, లేకుంటే వ్యవస్థలన్నీ నిర్వీర్యం అవుతాయని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పేర్కొన్నారు. నిజామాబాద్‌లో కొత్తగా ఓటు హక్కు పొందిన విద్యార్థినులతో గురువారం ఆమె ముచ్చటించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు అడిగిన పలు ప్రశ్నలకు కవిత సమాధానం ఇస్తూ.. ప్రజాస్వామ్య ప్రక్రియలో యువత క్రీయాశీలక భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ఎన్నికల్లో ఎవరు గెలిస్తే ఏమిటన్న ధోరణిలో ఉండొద్దని సూచించారు. ఓటు హక్కును వినియోగించుకోకపోతే వ్యవస్థలు నిర్వీర్యమవుతాయని, ఓటు హక్కును ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని కోరారు. రాజకీయాల్లోకి వచ్చే మహిళలు, యువతకు ఏం సందేశమిస్తారని ఓ యువతి అడిగిన ప్రశ్నకు కవిత సమాధానమిస్తూ.. రాజకీయాలు అంత సులువు కాదని, అయితే.. రాజకీయ నాయకులుగా తీసుకునే ఓ నిర్ణయం కోట్ల మంది జీవితాలను మార్చుతుందని, అందుకే కష్టపడి ప్రజల కోసం పనిచేయాలని సూచించారు. ప్రభుత్వరంగంలోనే కాకుండా ప్రైవేట్ రంగంలో ఉద్యోగాల కల్పనకు ప్రభుత్వం ఏం చర్యలు తీసుకుంటుంది? స్వయం ఉపాధి, జిల్లాల్లో ఐటీ హబ్‌ల ఏర్పాటుపై యువతులు అడిగిన ప్రశ్నలకు కవిత స్పందిస్తూ.. రాష్ట్రానికి దాదాపు 22 వేల కంపెనీలు వచ్చాయని, దాంతో 30 లక్షల మందికి ప్రత్యక్షంగా ఉద్యోగాలు వచ్చాయని, పరోక్షంగా మరో 30 లక్షల మందికి ఉపాధి లభించిందని వివరించారు. స్వయం ఉపాధి కోసం స్టార్టప్‌లను ప్రోత్సహించి చేయూతనిస్తున్నామని చెప్పారు. టీఎస్ పీఎస్సీలో సాంకేతిక సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ఏం చర్యలు చేపడుతుందని ఓ యువతి అడగగా.. రాష్ట్రంలో ఒకే ఒక్కసారి పేపర్ లీక్ ఉదంతం జరిగిందని, 10 రోజుల్లోనే నిందితులను పట్టుకున్నామని, ఒక రాజకీయ పార్టీ ప్రమేయముందని గుర్తించామని వివరించారు. బీఆర్ఎస్‌కు ఎందుకు ఓటేయాలని ఓ విద్యార్థిని ప్రశ్నించగా.. బీఆర్ఎస్ పార్టీ అద్భుతమని, తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పార్టీ కొట్లాడిందని చెప్పారు. రాష్ట్రం వచ్చాక అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తూ సీఎం కేసీఆర్ ప్రభుత్వం సమర్థంగా పనిచేస్తున్నది. అందుకే కారు గుర్తుకు ఓటు వేయాలని కవిత బదులిచ్చారు. తొలిసారి ఓటు వేసినప్పటి అనుభవం చెప్పాలని ఒక విద్యార్థిని కోరగా.. తాను మొదటి నుంచి తన తండ్రికే ఓటు వేశానని, చింతమడకలో తొలిసారి తల్లిదండ్రులతో కలిసి ఓటు వేశానని, అది ఎప్పటికీ మరిచిపోలేని అనుభవం అని చెప్పారు. సామాజిక మాధ్యమాల ద్వారా ఆడపిల్లలను వేధించేవారి విషయంలో రాష్ట్ర ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తున్నదని స్పష్టం చేశారు.

# పోలీసుల రక్షణ కావాలి

- హైకోర్టును ఆశ్రయించిన స్వతంత్ర అభ్యర్థి బర్రెలక్క

హైదరాబాద్, నవంబర్ 23 (నమస్తే తెలంగాణ): తనకు పోలీసుల రక్షణ కల్పించేలా ఉత్తర్వులు ఇవ్వాలని కోరుతూ కొల్లాపూర్ ఇండిపెండెంట్ అభ్యర్థి కర్నె శిరీష అలియాస్ బర్రెలక్క గురువారం హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ప్రతివాదులుగా హోంశాఖతోపాటు రాష్ట్ర ఎన్నికల అధికారి, నాగర్‌కర్నూల్ కలెక్టర్, ఎస్పీ, పెద్దకొత్తపల్లి స్టేషన్ హౌస్ ఆఫీసర్‌లను చేర్చారు. ఎన్నికల ప్రచారంలో తనకు అసాంఘిక శక్తులతోపాటు ఇతర పార్టీలవారు ఆటంకాలు కలిగిస్తున్నట్టు ఆమె ఆరోపించారు. గుర్తుతెలియని వ్యక్తుల నుంచి బెదిరింపు ఫోన్లు వస్తున్నాయని, ఈ నెల 21న తన సోదరుడు సంతోష్‌పై కొందరు దాడికి దిగి, కత్తితో బెదిరించారని పేర్కొన్నారు. దీనిపై కేసు కూడా నమోదైందని, తనకు రక్షణ కల్పించాలని పోలీసులకు వినతి పత్రం ఇచ్చినా పట్టించుకోలేదని వివరించారు.

# 40 కోట్ల జరిమానాపై వివరణ ఇవ్వండి

## ఎంపీ రఘురామ పిటిషన్‌పై ఈడీకి హైకోర్టు ఆదేశం

హైదరాబాద్, నవంబర్ 23 (నమస్తే తెలంగాణ): ఫెమా నిబంధనలు ఉల్లంఘించారన్న కారణంతో ఏపీ ఎంపీ కనుమూరి రఘురామ కృష్ణంరాజుకు రూ.40 కోట్ల జరిమానా విధించడంపై వివరణ ఇవ్వాలని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్‌ను తెలంగాణ హైకోర్టు ఆదేశించింది. ఇండ్ భారత్ సన్ ఎనర్జీ ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్‌గా ఉన్న ఆయనకు ఈడీ ఈ నెల 3న ఈ జరిమానా విధించింది. దీన్ని సవాలు చేస్తూ రఘురామ కృష్ణంరాజు దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ సూరేపల్లి నంద గురువారం విచారణ చేపట్టారు. కంపెనీ డైరెక్టర్ పదవికి 2013 ఏప్రిల్ 5న రఘురామ కృష్ణంరాజు రాజీనామా చేశారని, జరిమానా విధించడం చెల్లదని ఆయన తరపు న్యాయవాది పేర్కొన్నారు. ఈడీ వాదన విన్న తర్వాత తగిన ఉత్తర్వులు జారీ చేస్తామని స్పష్టం చేసిన న్యాయమూర్తి.. తదుపరి విచారణను డిసెంబరు ఒకటికి వాయిదా వేశారు.

# కేఎంసీ హాస్టల్‌లో మెడికోలపై చర్యలు

హైదరాబాద్, నవంబర్ 23 (నమస్తే తెలంగాణ): కర్నూలు మెడికల్ కాలేజీ (కేఎంసీ) నుంచి నలుగురు విద్యార్థులను ప్రిన్సిపాల్ సుధాకర్ బహిష్కరించారు. వీరితో పాటు మద్యం తాగుతున్నారనే అభియోగంపై మరో ఐదుగురు విద్యార్థులను ఆరు నెలల పాటు యూజీ హాస్టల్ నుంచి తొలగించారు.

### కేసీఆర్ హ్యాట్రిక్ సీఎం పక్కా

- కాంగ్రెస్‌కు ఓటేస్తే రాష్ట్రం అంధకారమే
- మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి

నల్లగొండ, నవంబర్ 23 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): బీఆర్ఎస్‌కు ప్రజల సంపూర్ణ మద్దతు ఉన్నదని, కేసీఆర్ హ్యాట్రిక్ సీఎం కావడం లాంఛనమేనని శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. గురువారం ఆయన నల్లగొండలోని తన క్యాంపు కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. దేశంలోనే గొప్ప విజన్ ఉన్న నేత కేసీఆర్ అని, ఆయన నాయకత్వంతో తెలంగాణ సురక్షితంగా ఉంటుందని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ ఆచరణ సాధ్యం కాని హామీలతో ప్రజలను మభ్య పెట్టాలని చూస్తున్నదని, ఆ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారెంటీలు కర్ణాటకలో అమలు కావడం లేదని దుయ్యబట్టారు. ఒక్క అవకాశం ఇవ్వాలని అడుగుతున్న కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి నల్లగొండ ప్రజలు నాలుగు సార్లు అవకాశం ఇస్తే ఏం అభివృద్ధి చేశారని ప్రశ్నించారు.

# కేసీఆర్ అచ్చినంకనే బాగైనం

- 70 ఏండ్ల కాంగ్రెస్ పాలనలో ఏంజేయలేదు
- అప్పుడు రైతుబంధు లేదు, నీళ్లు లేవు
- ఇప్పుడు 40 ఎకరాలు సాగుచేస్తున్న
- తోడబుట్టిన అన్నే పదివేలు ఇత్తలేడు..
- సీఎం సారు ఇద్దరు ఆడపిల్లలున్నా కల్యాణలక్ష్మి కింద డబ్బులు ఇస్తుండు
- శ్రీధర్‌బాబు చేసిందేమీలేదు
- మంథని ఎమ్మెల్యేగా పుట్ట మధును తప్పకుండా గెలిపించుకుంటం
- పెద్దపల్లి జిల్లా పెంచికల్‌పేట్‌లో ఓ మహిళా రైతు భావోద్వేగం

మంథని, నవంబర్ 23: తెలంగాణ ప్రజలు చైతన్యాన్ని ప్రదర్శిస్తున్నారు. ముఖ్యంగా మహిళలు రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు, విధానాలపై నిర్మొహమాటంగా కుండబద్దలు కొడుతున్నారు. సీఎం కేసీఆర్ తన ప్రసంగాల్లో 'రాయేదో.. రత్నమేదో.. అభ్యర్థి ఎవరో.. ఆయన ఏ పార్టీవాడో.. ఆ పార్టీకున్న చరిత్ర ఏందో చూసి ఓటేయాలి. ఇంటికి వెళ్లి చర్చపెట్టాలి' అని చెప్పిన మాటలతో స్ఫూర్తిపొందిన పెద్దపల్లి జిల్లా మంథని నియోజకవర్గంలోని కమాన్‌పూర్ మండలం పెంచికల్‌పేటకు చెందిన అనవేన రమ్య అనే మట్టి బిడ్డ భావోద్వేగంతో నిష్కల్మషంగా తన అభిప్రాయాలను వెల్లడించారు. గురువారం పెంచికల్‌పేటకు బీఆర్ఎస్ నాయకులు ప్రచారానికి రాగా.. రమ్య మైక్ తీసుకొని 70 ఏండ్ల కాంగ్రెస్ పాలన, పదేండ్ల కేసీఆర్ పాలనను పోల్చిచెప్పారు. అప్పటి కష్టాలు.. ఇప్పుడు అమలవుతున్న పథకాలను వివరించారు. ఆమె మాట్లాడిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. రమ్య మాటల్లోనే..'అరవై, డెబ్బై ఏండ్లు పాలించింది కాంగ్రెస్ పార్టీ. అప్పుడు మనకు నీళ్లు లేవు.. రైతుబంధు లేదు. రైతు బీమా లేదు.. నీళ్ల ప్రాబ్లం చేయవట్టి కొన్ని వేల ఎకరాల భూములు బీళ్లున్నాయి. కేసీఆర్ తెచ్చిన నీళ్లతో నిరుడు 40 ఎకరాలు సాగు చేయగా, వ్యవసాయంలో మేము బాగా ఎదిగినం. కేసీఆర్ రైతుబంధు, రైతుబీమా, నీళ్లు అన్ని ఇస్తుండు. ఆడపిల్ల కల్యాణానికి తోడబుట్టిన అన్నే 10 వేలు ఇస్తలేడు. ఇద్దరు ఆడపిల్లలున్నా కేసీఆర్ కల్యాణలక్ష్మి ఇస్తుండు. ఇవ్వన్ని చేసిన కేసీఆర్‌ను, మంథని బీఆర్ఎస్ అభ్యర్థి పుట్ట మధును గెలిపించాలి. మధన్న కు ఓటు వేయలేదంటే మన ప్రాణం పోయినట్టే. మా కుటుంబంలో మొత్తం 12 ఓట్లు ఉన్నయ్. ఇవన్నీ పుట్ట మధన్నకే. ముత్తారం మండలం మైదంబండ మా అమ్మవాళ్ల ఊరు. మేము చిన్నప్పటినుంచి శ్రీధర్‌బాబు చూస్తా న్నం. ఆయన చేసిన పనేం లేదు. ఒక్కరు కొట్లాడితే అచ్చేది కాదు. అందరు కొట్లాడాలి.. కచ్చితంగా పుట్ట మధన్నను గెలిపియ్యాలి' అంటూ ప్రసంగాన్ని వినిపించింది. ఆమె ప్రసంగం అనంతరం బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులు జై బీఆర్ఎస్.. జై కేసీఆర్.. జై పుట్ట మధన్న అంటూ నినాదాలు చేశారు. భావోద్వేగపూరితంగా రమ్య మాట్లాడిన తీరు ప్రతిఒక్కరినీ ఆలోచింపజేసింది.